క్లుప్తంగా

ప్రహరీలు, డివైడర్లకు రంగుల కళ



నక్కవానిపాలెం జంక్షన్‌లో డివైడర్‌కు వేసిన రంగులు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో స్మార్ట్ సిటీ పనులు జోరుగా సాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో ప్రహరీ గోడలు, డివైడర్లకు జీవీఎంసీ ఆధ్వర్యంలో రంగులు వేస్తున్నారు. ఇక్కడి నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, సీతమ్మధార తదితర ప్రాంతాల్లోని జంక్షన్ల వద్ద గల ప్రహరీలు, డివైడర్లను రంగులతో ముస్తాబు చేస్తున్నారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. స్మార్ట్ సిటీ పథకంలో భాగంగా ఇప్పటికే పలు ప్రాంతాలను జీవీఎంసీ సుందరంగా తీర్చిదిద్దడం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగిలిన జంక్షన్లలో కూడా పెయింటింగ్ పనులు కొద్ది రోజులుగా చురుగ్గా సాగుతున్నాయి. జోనల్ అధికారుల పర్యవేక్షణలో కార్మికులు పనులు నిర్వహిస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్ఐ భాస్కరరావు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. సాయంత్రం వేళల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న చోదకులకు జరిమానాలు విధించారు. ఆశీలమెట్ట, ద్వారకానగర్, గురుద్వారా, సీతంపేట తదితర జంక్షన్ల వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరరావు మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలని సూచించారు.

సంపత్ వేంకటేశ్వరుడికి విశేష పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మిదేవి, సంపత్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ, అర్చకులు శర్మ నేతృత్వంలో వెంకన్నకు సుప్రభాత సేవ, చక్రస్నానం చేశారు. వేకువ జాము 6 గంటలకు శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ, కమిటీ సభ్యులు పంచామృతాభిషేకాలు, తులసీమాలార్చన, కుంకుమ పూజలు జరిపారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా 108 వెండి కలశాలతో శ్రీగంధం జలాలను తీసుకువచ్చి స్వామికి కలశాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు స్వామి నిజపాద దర్శనం కల్పించారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఊరెళ్తే జాగ్రత్త..!

- పోలీసులకు ముందుగా సమాచారమివ్వండి
- ప్రజల ఇళ్లకు రక్షణగా ఉంటాం
- ఫోర్త్‌టౌన్ క్రైం ఎస్ఐ భాస్కరరావు





సీతమ్మధార: ప్రజలు సొంతూళ్లకు, సుదూర ప్రాంతాలకు వెళ్లే ముందు విధిగా పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఫోర్త్ టౌన్ క్రైం ఎస్ఐ భాస్కరరావు కోరారు. స్టేషన్‌లో శనివారం ‘సాక్షి’తో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖ ఇప్పటికే లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను అమలు చేస్తోందని గుర్తు చేశారు. ఏటా సంక్రాంతి, వేసవి, క్రిస్మస్ సెలవుల సీజన్‌తోపాటుగా ముఖ్యమైన పనులు, తీర్థయాత్రలు, వివాహాది శుభకార్యాల నిమిత్తం కుటుంబ సమేతంగా ఊర్లు వెళ్లే ముందు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ముందుగా ఎల్‌హెచ్‌ఎంఎస్ యాప్‌లో వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. దీంతో పోలీసులు సదరు ఇంట్లో సీసీ కెమెరాలు అమరుస్తారని తెలిపారు. స్టేషన్‌లో ఈ సీసీ కెమెరాలను సిబ్బంది మోనటరింగ్ చేస్తారన్నారు. సదరు ఇంట్లో ఎవరైనా దొంగలు ప్రవేశిస్తే సిబ్బంది దగ్గరలోని పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడికి చేరుకునేలా చర్యలు చేపడతారన్నారు. ఇంటి వద్ద రాత్రి గస్తీ యథావిధిగానే కొనసాగుతుందని చెప్పారు.

రాత్రిళ్లు ఒంటరిగా తిరగవద్దు

రాత్రి పూట ఒంటరిగా ఎవరూ ఎటూ వెళ్లరాదని క్రైం ఎస్ఐ భాస్కరరావు సూచించారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్‌లు దాడులు చేస్తున్నాయని తెలిపారు. డబ్బులు, మొబైల్ ఫోన్ల చోరీల కోసం ఈ బ్యాచ్‌లు దాడులకు పాల్పడుతున్నాయన్నారు. రోడ్ల మీద పార్క్‌చేసి ఉన్న వాహనాల్లో పెట్రోల్ చోరీలు జరుగుతున్నాయన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత

దుకాణాలు, షాపింగ్ కాంప్లెక్సులు, అపార్ట్‌మెంట్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ముఖ్యంగా నైట్ విజన్ మోడల్ కెమెరాలను ఉపయోగించాలని సూచించారు. తద్వారా ఇంటికి వచ్చేవారు మనకు తెలిసిన వారా లేదా దొంగలా అన్నది ఇట్టే సులభంగా గుర్తించడానికి ఆస్కారం ఉంటుందని చెప్పారు. జీపీఎస్ అనుసంధానం ద్వారా వాహనం చోరీ అయినా సరే.. అది ఎక్కడ ఉందన్నది సులభంగా గుర్తించి పోలీసులు రికవరీ చేయడానికి ఆస్కారం ఉంటుందన్నారు.

ప్రజలంతా అప్రమత్తం

రాత్రి పూట చెడ్డీ గ్యాంగ్ ఆగడాలు పెరుగుతున్నాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ భాస్కరరావు హెచ్చరించారు. అపార్ట్‌మెంట్ వాసులంతా అన్ని వేళలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిద్రపోయే ముందు మొబైల్ ఫోన్లు కిటికీల వద్ద పెట్టడం వల్ల కూడా చోరీలకు గురవుతున్నాయన్నారు. ప్రజలంతా పోలీసు శాఖకు సహకరించి, ఊర్లో ముందు విధిగా సమాచారమిస్తే నేరాల కట్టడికి సంయుక్తంగా ముందుకు వెళ్దామని ఆయన పిలుపునిచ్చారు.

యోగాతో ఆరోగ్య సమస్యల పరిష్కారం



యోగా సాధన చేస్తున్న పాస్‌పోర్ట్ అధికారి విశ్వాంజలి ఎం.గైక్వాడ్, ఇతర సిబ్బంది



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న విశ్వాంజలి

మురళీనగర్: యోగా సాధనతో రోజు వారి ఆరోగ్య సమస్యలను అధిగమించవచ్చని విశాఖపట్నం ప్రాంతీయ పాస్‌పోర్ట్ అధికారి విశ్వాంజలి ఎం.గైక్వాడ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం మద్దిలపాలెంలోని రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో యోగా సాధనపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరిలో ఒత్తిడి పెరిగిందన్నారు. గాడ్జెట్–ఇంటెన్సివ్ జీవనంలో మనిషి జీవితంలో ఏర్పడుతున్న సమస్యలను యోగా సాధన ద్వారా పరిష్కరించుకోవచ్చని వివరించారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందడానికి, నిరంతరం చైతన్యవంతంగా ఉండడానికి యోగా చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. యోగా టీచర్ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. సిబ్బంది సందేహాలను ఆయన నివృత్తి చేశారు. నృత్యాంజలి స్పిరిట్ ఆఫ్ ఆర్ట్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విద్యార్థులకు విశ్వాంజలి ఎం.గైక్వాడ్ ప్రశంసాపత్రాలు అందించారు.

కేవీ నూతన ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ తరగతులకు హాజరైన నూతన ఉపాధ్యాయులు

కంచరపాలెం:స్థానిక కంచరపాలెం శ్రీవిజయనగర్‌లోని కేంద్రీయ విద్యాలయం–2లో సంఘటన్ ద్వారా నూతనంగా ఎంపికైన హైదరాబాద్ రీజియన్‌కు చెందిన ఉమ్మడి జిల్లాలోని వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో నియమితులైన నూతన ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఈస్టర్న్ నేవల్ కమాండ్, విద్యాలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ కమాండర్ రజత్ నాగ్‌పాల్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. విద్యాలయ సంఘటన్ మిషన్, ఆశయాలు, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అనుసరణ, నిపుణ్ భారత్, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్, పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రవర్తనా నియమావళి, సమగ్ర విద్యా పరిపాలన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ 26వ వరకు శిక్షణ ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కేవీ–1 ప్రిన్సిపాల్ మదీనా మాలిక్, సాహిత్య, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో మాస్టర్ సి.వి.వి. మే కాల్ డే ఉత్సవాలు



లాస్ క్రూసెస్ నగరంలో అగ్నిహోత్ర క్రతువు నిర్వహిస్తున్న సత్యదేవ్



స్పెయిన్‌లో సాధక బృందంతో చంద్రశేఖర గురుప్రసాద్

తాటిచెట్లపాలెం: లోకహితార్థం జీవించిన పరమ గురువుల బోధనలు, వారు చూపిన మార్గం నేడు భౌగోళికంగా వ్యాప్తి చెందాయని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. మాస్టర్ సి.వి.వి. తన యోగ మార్గాన్ని ఉపదేశించిన మే 29న ప్రతీ ఏటా మే కాల్ డేగా పాటిస్తారు. 1910లో ప్రప్రథమంగా కుంభకోణంలో మాస్టర్ సి.వి.వి. మే కాల్ డేను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ ఇటీవల యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో నిర్వహించిన తన 4వ యాత్రను ముగించుకుని నగరానికి చేరుకున్నారు. మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో శనివారం పలు విషయాలను ఆయన వెల్లడించారు. అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రంలో గల లాస్ క్రూసెస్, థావోస్, డల్లాస్ నగరాల్లో మే కాల్ డే సందర్భంగా ఉత్సవాలు, సత్సంగాలు, పూజాది క్రతువులను జరిపానని చెప్పారు. మాస్టర్ సి.వి.వి. ప్రార్థన, యోగ మార్గంపై విదేశీయులు ఆసక్తి చూపుతున్నారని, మాస్టర్ ఇ.కె.రచనలు వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీకుమార్‌లు రాసిన అనేక గ్రంథాలు జర్మనీ, స్పెయిన్ దేశాల్లో వారి వారి భాషల్లో అనువాదమై, పాశ్చాత్యుల ఆధ్యాత్మిక సాధనకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయానికి నాడు మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీకుమార్‌లు చేసిన విదేశీయాత్రలు నేడు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ట్రస్ట్ భౌగోళిక అధ్యక్షుడు కె.చంద్రశేఖర గురుప్రసాద్ ఇటీవల స్పెయిన్, జర్మనీ దేశాల్లో 15 రోజులు పర్యటించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. మాస్టర్ సి.వి.వి. 115వ మే కాల్ డేను నిర్వహించారని, ఆయా దేశాల్లో అగ్నిహోత్రాది క్రతువులను కూడా నిర్వహించినట్లు సత్యదేవ్ చెప్పారు.

సమస్త శక్తుల సమాహారం మహాకాళి



ప్రవచిస్తున్న రమ్యానందభారతీ స్వామిని

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం త్రిశక్తి వైభవంపై శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని ప్రవచనం చేశారు. దేవీ భాగవతం, కాళీ పురాణంలో అమ్మవారి వైభవ విశేషాలు ఉన్నాయని తెలిపారు. కాళీ రూపంలో అమ్మవారు పరమేశ్వరుడికి ప్రియమైన స్వరూపమని, శివశక్తి అభేద్యమని, కాళీమాత వాక్శక్తినిచ్చే దేవతని, సమస్త శక్తుల సమాహారమైన మహాకాళి అని కాళీతత్వాన్ని వివరించారు. మాత అలంకారాలను, ఆయుధాలను, శక్తులను, విశిష్టతను వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్య



అజయ్‌శంకర్(ఫైల్)

మద్దిలపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అజయ్‌శంకర్(36) అనే వ్యక్తి జ్ఞానాపురంలో ఒంటరిగా నివసిస్తున్నాడు. పూర్ణా మార్కెట్‌లో ఓ బంగారం వ్యాపారి వద్ద కార్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య ఉంది. ఈ దంపతుల మధ్యవిభేదాల వల్ల ఆమె నర్సీపట్నంలో తన తల్లి దగ్గర ఉంటోంది. ఈ నెల 20న సాయంత్రం నుంచి అజయ్‌శంకర్ ఇంట్లోనే ఉన్నాడు. రెండు రోజులుగా తలుపులు తెరవడం లేదని కిటికీ నుంచి ఆ ఇంటి యజమాని చూడగా.. మంచంపై పడి ఉన్నాడు. దీంతో అతడి భార్యకు యజమానికి సమాచారం అందించడంతో ఆమె వచ్చింది. అనంతరం మృతుడి తండ్రికి సమాచారం అందించారు. అతడి తండ్రి సోమేశ్వరరావు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకు ఎవరితోనూ ఎటువంటి ఇబ్బందులు లేవని, బతకాలని లేదని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. మృతికి గల కారణాలను తెలుసుకుంటున్నారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు. భార్యతో విభేదాల కారణంగా అజయ్‌శంకర్ మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

హైవే డివైడర్లపై అసాంఘిక కార్యకలాపాలు



సత్యం జంక్షన్ వద్ద డివైడర్‌లో మద్యం సీసాలు, పేక ముక్కలు

సీతమ్మధార: మందుబాబులు, పేకాటరాయుళ్ల చివరకు డివైడర్లను కూడా వదలడం లేదు. ఇప్పటి వరకు ఇళ్లు, ఆటోలు, దుకాణాల వద్ద చేసే మద్యపానం, పేకాట ఇప్పుడు జాతీయ రహదారి మధ్య గల డివైడర్ల మీద యథేచ్ఛగా నిర్వహించడం గమనార్హం. మద్దిలపాలెం నుంచి సత్యం జంక్షన్ వరకు గల జాతీయ రహదారి డివైడర్ మీద రోజూ మద్యం సీసాలు, పేకాట కాగితాలతో జుగుప్స కలిగిస్తోందని వాహన చోదకులు, పాదచారులు అంటున్నారు. రాత్రయితే చాలు మహిళలు రోడ్డు దాటేటపుడు మందుబాబుల చిందులతో అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకవైపు మద్యపానం, మరోవైపు జోరుగా పేకాట సాగుతున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు మదనపడుతున్నారు. హైవే గస్తీ పోలీసులు డివైడర్ మీద జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు నివారించే దిశగా దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

వీధిలైట్లు ఏర్పాటు చేయాలని విద్యార్థుల వినతి

అల్లిపురం: ఊర్వశి జంక్షన్ సమీపంలో గల కప్పరాడ ట్రైబల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ ఎదుట గల సర్వీస్ రోడ్డులో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని హాస్టల్ విద్యార్థులు, ఏబీడీఎస్‌వో విద్యార్థి సంఘం ప్రతినిధులు జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కేఎస్ విశ్వనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు వీధి దీపాలు లేకపోవటంతో విద్యార్థులకు భద్రత, రక్షణ లేకుండా పోయాయన్నారు. ఈ మధ్య కొన్ని రౌడీమూకలు చీకటి పడిన తర్వాత హాస్టల్‌కు వచ్చే దారిలో కాపుకాచి ఒంటరిగా వస్తున్న విద్యార్థులపై దాడులు చేస్తున్నారని ఏసీ వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే సర్వీస్ రోడ్డులో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా మలేరియా అధికారిని సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం జిల్లాలో ‘స్టాప్ డయేరియా’ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. ఐఆర్‌ఏడీ యాప్ అప్‌లోడ్ గురించి తెలిపారు. అంతే కాకుండా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్, ఫారం–ఎఫ్ అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ తదితర వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఆస్పత్రులు రెన్యువల్స్, రిజిస్ట్రేషన్స్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఫారం–ఎఫ్ ఆన్‌లైన్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ కాన్పులు చేయాలని, సాధ్యమైనంత వరకు సి-సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసీరాజ్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులకు సంబంధించిన రిపోర్టులు తెలియజేసేటప్పుడు రోగుల ఆధార్ కార్డు, ఇతర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దాని వలన రోగిని సులభంగా గుర్తించి మెరుగైన వైద్య సేవలందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ జగదీష్ ప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐఆర్‌ఏడీ మెడికల్ అధికారి డాక్టర్ ఎ.యామినీకాంతి, జిల్లా గణాంక అధికారి మురళీకృష్ణ, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మా అంగీకారంతోనే భూములిచ్చాం

- కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ముదపాక ల్యాండ్ పూలింగ్ రైతుల స్పష్టీకరణ



మాట్లాడుతున్న ముదపాక రైతులు

సీతంపేట: మా అంగీకారంతోనే ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చామని పెందుర్తి మండలం ముదపాక రైతులు స్పష్టం చేశారు. అయినా తమ భూములపై ఓ వర్గంతో పాటు ఓ దిన పత్రికలో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ముదపాక రైతులు సారిపల్లి గణేష్, ముదపాక శివ, సియ్యాద్రి రమణ, గొర్లె అప్పన్న, గొలగాని దేముడు తదితరులు విలేకరులతో మాట్లాడారు. ల్యాండ్ పూలింగ్ స్కీంలో భాగంగా అసైన్డ్ రైతులు, ఆక్రమణలో ఉన్న రైతులను గుర్తించి తమ వద్ద ప్రభుత్వం భూమి సేకరించి అసైన్డ్ అయితే ఎకరాకు 900 చదరపు గజాలు, ఆక్రమణ భూమి అయితే ఎకరాకు 450 చదరపు గజాల చొప్పున రిజిస్ట్రేషన్ చేసి సర్వ హక్కులు కల్పిస్తామని చెప్పడంతో తామంతా భూములు ఇచ్చామన్నారు. 2016లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 290 ప్రకారం ముదపాక గ్రామంలో సర్వే నంబర్లు 76, 1, 83, 67, 75లలో సుమారు 350 ఎకరాలు పూలింగ్‌కు ఇచ్చామని తెలిపారు. గ్రామ సభల అనంతరం రెవెన్యూ అధికారుల సమక్షంలో రైతుల భూముల సర్వే జరిగిందని, ఆ సమయంలో అప్పటి వీఆర్వోను మభ్యపెట్టి ఈ సర్వే నంబర్లలో భూమి లేని వారి పేర్లు చేర్చారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి తప్పుడు సమోదులను తొలగించి నిజమైన రైతులను గుర్తించారని చెప్పారు. నిజమైన రైతులకు ప్రభుత్వం ల్యాండ్‌పై హక్కులు కల్పిస్తూ పత్రాలు జారీ చేసిందన్నారు. దీంతో ఎక్కువ భూములు కలిగినట్టు దొడ్డిదారిన నమోదు చేయించుకున్న ఓ వర్గం వ్యక్తులు హైకోర్టులో కేసులు వేశారన్నారు. కొందరు తమ స్వార్థ ప్రయోజనాలతో ఓ దినపత్రికతో పాటు ముదపాక పంచాయతీ పాటు యంత్రాంగంపై రోజూ నిరాధారమైన వార్తలు రాయిస్తున్నారని ఆరోపించారు. ల్యాండ్ పూలింగ్ స్కీంకు వ్యతిరేకంగా హైకోర్టులో కేసులు వేసిన వ్యక్తుల భూమి మినహాయించి పూలింగ్‌కు సమ్మతించిన రైతులకు మాత్రమే లే అవుట్ వేసి కన్వేయన్స్ డీడ్స్ ద్వారా హక్కులు కల్పించడం జరిగిందన్నారు. ముదపాక భూములపై తప్పుడు వార్తలు ప్రచురించడంతో నిజమైన హక్కులు పొందిన తాము తమ అవసరాలకు భూమి విక్రయించడానికి ఆటంకం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరాధారమైన వార్తలు ప్రచురిస్తున్న పత్రికపై చర్యలు తీసుకోవాలని, న్యాయస్థానాన్ని పక్క దోవ పట్టిస్తున్న ఓ వర్గంపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

కేకే లైన్‌లో జీఎం తనిఖీలు



కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్



అరకు–కొత్తవలస సెక్షన్ మధ్య బ్రిడ్జి, టన్నెల్‌లను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కేకే(కొత్తవలస–కోరాపుట్) లైన్‌లో శనివారం ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణా సామర్థ్యం, ప్రయాణికుల సదుపాయాలతోపాటు రెండో లైన్ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా రైల్ వినియోగదారులు, భాగస్వాములైన ఎన్‌ఎండీసీ వంటి కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రైల్వే అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలని, దీని ద్వారా ఇరువర్గాలు లబ్ధి పొందుతాయని జీఎం సూచించారు. ఈ మార్గంలో గల కోరాపుట్, అరకు, శివలింగపురం స్టేషన్లలో పర్యటించి, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విండో ట్రయలింగ్ ద్వారా నిర్మాణంలో ఉన్న డబ్లింగ్ లైన్, గుహలు, మలుపులు, క్రాసింగ్స్, పాయింట్స్, వంతెనలను కూడా తనిఖీ చేశారు. పర్యటనలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ దిబ్యంజన్ రాయ్, ఇతర ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



జగదీష్‌ను సత్కరిస్తున్న కంచర్ల అచ్యుతరావు, శ్రీనుబాబు తదితరులు

సీతంపేట: పద్మభూషణ్ డాక్టర్ చిరంజీవి కళా పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు సినీగీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా కళా పరిషత్ వైజాగ్ అధ్యక్షుడు గెంబలి జగదీష్‌ను ఉపకార్ ట్రస్టు ఎండీ కంచర్ల అచ్యుతరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం నాయకులు గంట్ల శ్రీనుబాబు, సకల కళాకారుల సంఘం నాయకులు చెన్నా తిరుమలరావు, సినీ మా అసోసియేషన్ సభ్యులు భయ్యా శ్రీనివాస్, లోకేశ్వరరావు, శ్రీదేవి మహానటి సాంస్కృతిక సేవా సంస్థ ప్రతినిధి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

జల సంరక్షణకు శ్రీకారం



ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వరప్రసాద్

మురళీనగర్: నగరంలో భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్(ఏపీ ఫెర్వాస్) అధ్యక్షుడు ఉదయ్ షిర్‌నామే తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షిర్‌నామే మాట్లాడుతూ నగరంలోని అన్ని పార్కుల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణానికి అయ్యే ఖర్చు తమ సంఘం భరిస్తుందని తెలిపారు. కాంక్రీట్ జంగిల్ పెరుగుతున్న నేపథ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా జల సంరక్షణకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని సనపల వరప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్.ఆర్.మూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జోన్–5 కో ఆర్డినేటర్ కర్రి శేషగిరిరావు, వనితా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి పాల్గొన్నారు.